క్లుప్తంగా

నేడు మండల సమావేశం

బుచ్చినాయుడుకండ్రిగ : మండల కేంద్రం లోని స్థానిక ఎంపీడీఓ కార్యాలయంలో బుధవారం ఉదయం 11 గంటలకు ఎంపీపీ మేకల సుబ్బలక్ష్మి అధ్యక్షతన మండల సమావేశం నిర్వహిస్తున్నట్లు ఎంపీడీఓ త్రివిక్రమ్ రావు తెలిపారు. అధికారులు ప్రజాప్రతినిధులు తప్పక హాజరు కావాలని ఆయన కోరారు.

చెరివిలో వైద్యశిబిరం



కంటి పరీక్షలు చేస్తున్న వైద్య సిబ్బంది

శ్రీసిటీ(సత్యవేడు) : శ్రీసిటీలోని టిల్‌హెల్త్ కేర్ పరిశ్రమ కార్పొరేట్ సామాజిక బాధ్యతలో భాగంగా చెరివిలో శంకర్ నేత్రాలయ వైద్యులు, పారా మెడికల్ సిబ్బందితో కంటి వైద్య శిబిరం నిర్వహించారు. సోమవారం శ్రీసిటీ ఫౌండేషన్ సహకారంతో 145 మందికి వైద్య సేవలందించారు. ఈ సందర్భంగా శ్రీసిటీ మేనేజింగ్ డైరెక్టర్ రవీంద్ర సన్నారెడ్డి టిల్ కంపెనీ చొరవను అభినందించారు. శ్రీసిటీలోని కంపెనీలు ఇలాంటి ఆరోగ్య సంరక్షణ శిబిరాలు నిర్వహించేందుకు ముందుకొస్తాయని ఆశాభావం వ్యక్తం చేశారు. కార్యక్రమంలో టిల్ హెల్త్ కేర్ ప్లాంట్ ఆపరేషన్ హెడ్ అరుణ్ మంగ్లా, వైస్ ప్రెసిడెంట్ మనోజ్ కుమార్ రాఠి, మార్కెటింగ్ మేనేజర్ మనోజ్ నాయర్, హెచ్‌ఆర్ మేనేజర్ రవిచంద్ర, శ్రీసిటీ వైస్ ప్రెసిడెంట్ (కస్టమర్ రిలేషన్) రమేష్ కుమార్, సురేంద్రనాథ్ పాల్గొన్నారు.

ఇళ్ల నిర్మాణాలు వేగవంతం చేయండి

సత్యవేడు : మండలానికి మంజూరైన 334 ఇళ్ల నిర్మాణాల లక్ష్యంను మార్చి 31లోపు పూర్తి చేయాలని ఎంపీడీఓ చంద్రశేఖర్ తెలిపారు. మంగళవారం ఇంజినీరింగ్ అసిస్టెంట్‌లతో ఎంపీడీఓ కార్యాలయంలో డీఈ శేషగిరి పర్యవేక్షణలో సమావేశం నిర్వహించారు. మండలంలో 1504 ఇళ్లు మంజూరు కాగా ప్రస్తుతం 683 ఇళ్లు పూర్తి అయినట్లు ఏఈ భానుప్రకాష్ తెలిపారు. అతి స్వల్పంగా ఆరూరులో 17 ఇళ్లు మాత్రమే పూర్తి చేశారన్నారు.

త్యాగరాజస్వామి ఆరాధనోత్సవాలు



హాజరైన కోలా ఆనంద్, నాయకులు

శ్రీకాళహస్తి : పట్టణంలోని పొన్నాలమ్మ ఆలయం వద్ద గల సత్రంలో మంగళవారం ఘనంగా త్యాగరాజ స్వామి ఆరాధనోత్సవాలను నిర్వహించారు. స్వామి వారికి ప్రత్యేక పూజలు చేశారు. కార్యక్రమంలో బీజేపీ రాష్ట్ర కార్యదర్శి కోలా ఆనంద్, నాయకులు సుబ్రహ్మణ్యంరెడ్డి నాయీ బ్రాహ్మణులు మహేంద్ర, బాలసుబ్రహ్మణ్యం, మునిశేఖర్ పాల్గొన్నారు.

బాధితుడికి సీఎం సహాయ నిధి మంజూరు

శ్రీకాళహస్తి : రేణిగుంట పట్టణానికి చెందిన బాధితుడు దేవలం జగదీష్ అయిదేళ్లుగా రెండు కిడ్నీలు పాడైపోవడంతో డయాలసిస్ చేసుకుంటున్నాడు. ఆర్థిక పరిస్థితి అంతంత మాత్రమే. ఈ విషయాన్ని జనసేన నియోజకవర్గ ఇన్‌ఛార్జి కోట వినుతకు వివరించడంతో ఆమె డిప్యూటీ సీఎం పవన్ కల్యాణ్ దృష్టికి తీసుకెళ్లారు. స్పందించిన ఆయన సీఎం సహాయ నిధి మంజూరు చేయించారు. దీంతో మంగళవారం జగదీష్‌కు రూ.12 లక్షల చెక్కును అందజేశారు.

క్యాట్ ఒలింపియాడ్‌లో విద్యార్థుల ప్రతిభ



శ్రీకాళహస్తి విద్యార్థులతో ఉపాధ్యాయులు

శ్రీకాళహస్తి, శ్రీకాళహస్తి రూరల్ (రేణిగుంట) : ఆల్ ఇండియా క్యాట్ ఒలింపియాడ్ పరీక్షల్లో శ్రీకాళహస్తి శ్రీరామ్‌నగర్ కాలనీలోని, రేణిగుంటలోని శ్రీ చైతన్య పాఠశాలల విద్యార్థులు క్యాష్ అవార్డ్స్, మెడల్స్, సర్టిఫికెట్లు బహుమతులు సాధించారు. ఈ సందర్భంగా మంగళవారం శ్రీకాళహస్తి, రేణిగుంట పాఠశాలల ప్రిన్సిపల్స్ రూపాదేవి, చారుమతి మాట్లాడుతూ.. సంజన, యోగేశ్వరి, రిత్విక్, చెంచుర ఊప, కీర్తన్ గురు, హర్షిత నగదు తదితరులు బహుమతులు పొందారన్నారు. 32 మంది విద్యార్థులు పతకాలు, ప్రశంసాపత్రాలు, 28 మంది విద్యార్థులు ప్రశంసాపత్రాలు దక్కించుకున్నారన్నారు. కార్యక్రమంలో ఏజీఎం సురేష్, డీన్‌లు సుబ్రహ్మణ్యం, గోవర్ధన్, ఇన్‌ఛార్జిలు త్రివేణి, భారతి ఉపాధ్యాయులు పాల్గొన్నారు.



రేణిగుంట : పతకాలు సాధించిన విద్యార్థులు

ప్రమాదకరంగా వంతెన



మండలంలోని వెస్టువరత్తూరు వద్ద శ్రీకాళహస్తి-తడ రోడ్డుపై నిర్మించిన వంతెన ప్రమాదకరంగా మారింది. కాలువపై 30 ఏళ్ల కిందట వంతెనను నిర్మించారు. అప్పటి నుంచి వంతెనకు ఎలాంటి మరమ్మతులు చేపట్టకపోవడంతో శిథిల దుస్థితికి చేరుకుంది. వంతెనకు ఇరువైపులా రక్షణగోడలు ధ్వంసమై ప్రమాదకరంగా మారింది. నిత్యం వంతెనపై భారీ వాహనాలు, బస్సులు, కార్లు వేల సంఖ్యలో రాకపోకలు సాగిస్తుంటాయి. ఎలాంటి సూచిక బోర్డులను సైతం ఏర్పాటు చేయకపోవడంతో వాహనదారులు ప్రమాదాలకు గురవుతున్నారు. - బుచ్చినాయుడుకండ్రిగ

'పగ'మంచు



మండలంలో రెండు రోజులుగా పొగమంచు పల్లెలను కమ్మేస్తోంది. ఉదయం 8 గంటల వరకు పొగమంచు వీడడంలేదు. దీంతో మండల ప్రజలు తీవ్ర ఇబ్బందులు పడుతున్నారు. పొగమంచు తీవ్రతతో పంటలకు తెగుళ్లు సోకుతున్నాయని రైతులు ఆందోళన చెందుతున్నారు. మరోవైపు వాహనదారులకు ఎదురుగా వచ్చే వాహనాలు కనపడక ప్రమాదాలకు గురవుతున్నారు. ఇంకోవైపు వృద్ధులు, చిన్నపిల్లలు అనారోగ్యంబారిన పడుతున్నారు. - బుచ్చినాయుడుకండ్రిగ

రోడ్డు దిగితే గోతిలోకే..!




మండలంలోని పదవమైలు గ్రామం వద్ద కేటీ రోడ్డు పక్కనే తవ్విన గ్యాస్ పైపులైన్ గుంతలో కంటైనర్ లారీ దిగబడింది. దీంతో రోడ్డుపై ట్రాఫిక్‌కు అంతరాయం ఏర్పడింది. రోడ్డుపై భారీ గొయ్యి ఉండటంతో దీనిని తప్పించబోయి గ్యాస్ పైపులైన్ కోసం తవ్విన గుంతలో కంటైనర్ లారీ ఇరుక్కుపోయింది. క్రేన్‌ల ద్వారా గోతిలో దిగబడిన లారీని బయటకు తీసే ప్రయత్నాలు ఏవీ ఫలించలేదు. రోడ్డు దిగితే వాహనాలు దిగబడి పోతుండటంతో వాహనాదారులు ఆందోళన చెందుతున్నారు. - బుచ్చినాయుడుకండ్రిగ

రేణిగుంట బీసీ బాలుర హాస్టల్‌లో 64 మంది విద్యార్థులు వివిధ ప్రాంతాల నుంచి వచ్చి ఇక్కడే వసతి పొందుతూ ప్రభుత్వ బాలుర ఉన్నత పాఠశాలలో చదువులు అభ్యసిస్తున్నారు. ఇంత మంది విద్యార్థులు బస చేసే హాస్టల్‌లో కేవలం ఇద్దరు మాత్రమే వారి బాగోగులు చూసుకుంటున్నారు. రాత్రిపూట విద్యార్థులకు జ్వరం, కడుపునొప్పి ఇతర సమస్యలు వస్తే ఆ పిల్లల సంరక్షణ గాలిలో దీపంలా మారింది.

– శ్రీకాళహస్తి రూరల్ (రేణిగుంట)

రేణిగుంట బీసీ హాస్టల్ ప్రాంగణం



ఊరికి దూరం.. భద్రత ఘోరం

- 64 మందికి ఇద్దరే దిక్కు
- బీసీ హాస్టల్లో సమస్యలు కోకొల్లలు
- పెండింగ్‌లో భోజన బిల్లులు
- వాచ్‌మెన్ లేక ఇబ్బందులు

వార్డెన్‌తో పాటు అటెండర్, వాచ్‌మెన్, వంట మనిషి ఉండాలి. కానీ ప్రస్తుతం వార్డెన్, వంట మనిషి మాత్రమే ఉన్నారు. వంట మనిషి వంటలు చేసి, హాస్టల్ గదులు, బాత్రూం శుభ్రం చేసి వాచ్‌మెన్ డ్యూటీ కూడా చేయాలంటే సాధ్యమయ్యే పని కాదు. కానీ రేణిగుంట బీసీ హాస్టల్‌లో మాత్రం సుమారు 56 సంవత్సరాల మహిళా ఉద్యోగి ఇవన్నీ చేయలేక ఉద్యోగం వదిలేయలేక అవస్థలు పడుతున్నారు.

రాత్రి సమయాల్లో బయట తిరగడం

64 మంది పిల్లల సంరక్షణ అంటే మామూలు విషయం కాదు. వాచ్‌మెన్ లేకపోవడం, హాస్టల్ ఊరికి బయట ఉండడంతో రాత్రి సమయాల్లో బయట వ్యక్తులు హాస్టల్ ప్రాంగణం వద్దకు రావడంతో విద్యార్థులు వారితో కలిసి బయట తిరగడం పరిపాటిగా మారింది. పూర్తి స్థాయిలో సిబ్బందిని కేటాయిస్తే తప్ప సమస్యలు పరిష్కారం కాని పరిస్థితులు నెలకొన్నాయి.

హాస్టల్‌లో పాముల బెడద

బీసీ హాస్టల్ చుట్టు పక్కల మొత్తం ముళ్లచెట్ల పొదలు ఉండడంతో పాములు బెడద అధికంగా ఉంది. హాస్టల్లోకి పాములు వస్తుండటంతో విద్యార్థులు భయాందోళనకు గురవుతున్నారు. పాములు ఎక్కడ ఉన్నాయో..ఎప్పుడు వస్తాయో తెలియక భయం భయంగా కాలం వెల్లదీస్తున్నారు.

దొంగల భయం

ఊరికి బయట బీసీ హాస్టల్ ఉండడంతో రాత్రి సమయం, సెలవు రోజుల్లో దొంగలు హాస్టల్లో చొరబడుతున్నారు. హాస్టల్ ప్రహరీ తక్కువ ఎత్తు ఉండడంతో మోటారు వైరులు, బయటి ఉండే వస్తువులు అపహరించుకొని వెళ్తున్నారు. సంక్రాంతి సెలవులకు హాస్టల్ మూసేసిన సమయంలో హాస్టల్ ఆవరణలో ఉన్న మోటారు వైరును దొంగలు అపహరించారు. తర్వాత విద్యుత్ సిబ్బందితో వార్డెన్ వైరింగ్ పనులు చేయించాల్సిన పరిస్థితులు నెలకొన్నాయి.

ప్రజాప్రతినిధుల చొరవతో అభివృద్ధి పనులు

తిరుపతి పార్లమెంట్ సభ్యుడు డాక్టర్ గురుమూర్తి చొరవ తీసుకొని రూ.2.42 లక్షలతో మినరల్ వాటర్ ప్లాంట్‌ను హాస్టల్‌లో ఏర్పాటు చేయించారు. స్థానిక ఎమ్మెల్యే సుధీర్‌రెడ్డి హాస్టల్‌కు పెయింటింగ్, ఫ్యాన్లు, నీటి కొళాయిలు, వైరింగ్ పనులను చేయించారు. వసతిగృహానికి ప్రజాప్రతినిధులు పార్టీలకు అతీతంగా చేయూత అందిస్తున్నా అధికారులు మాత్రం విద్యార్థుల సంక్షేమాన్ని గాలికొదిలేయడం విస్మయానికి గురిచేస్తోంది.





తక్కువ ఎత్తులో ఉన్న హాస్టల్ ప్రహరీ, ప్రహరీ పక్కనే విపరీతంగా పెరిగిన ముళ్ల పొదలు

ఉన్నతాధికారుల దృష్టికి తీసుకెళ్లా

బీసీ హాస్టల్‌లో బాత్రూములు, తలుపులు, కిటికీ పనులు స్థానిక ఎమ్మెల్యే చేయిస్తానని హామీ ఇచ్చారు. సిబ్బంది కొరత సమస్యను ఉన్నతాధికారుల దృష్టికి తీసుకెళ్లా.

– వెంకటేశ్వర్లు , బీసీ హాస్టల్ వార్డెన్, రేణిగుంట

మండప ప్రారంభోత్సవంపై మండిపాటు!



మాట్లాడుతున్న దేవాంగులు

శ్రీకాళహస్తి : శ్రీకాళహస్తి ఆలయం ముందు ఉన్న దేవాంగుల మండపం సోమవారం ప్రారంభోత్సవానికి ఆహ్వానం ఇవ్వకపోవడంపై దేవాంగులు ఆందోళన వ్యక్తం చేశారు. తమ పూర్వీకులు ఆలయం ఎదుట మండపం ఏర్పాటు చేసి వాహనాలు నిలుపుకునేందుకు అవకాశం ఇచ్చారన్నారు. ఇతర అవసరాలకు మండపాన్ని వినియోగించలేదన్నారు. గత ప్రభుత్వంలో దేవాంగుల నిర్మాణానికి పునాది వేసే సమయంలో తమ సమక్షంలో భూమిపూజ చేసి పునాదులు వేశారన్నారు. సోమవారం మండపం ప్రారంభోత్సవానికి దేవాంగులు లేకుండా ప్రారంభించడం బాధాకరమన్నారు. ఈ విషయమై ఆలయ ఈఓపై వారు మండిపడ్డారు. ఈ విషయంపై ఎమ్మెల్యే బొజ్జల సుధీర్‌రెడ్డికి వినతిపత్రం అందించారు.

రీసర్వేతో భూసమస్యల పరిష్కారం



యానాదివెట్టులో నిర్వహించిన గ్రామసభ

వరదయ్యపాళెం : మండలంలోని యానాదివెట్టులో పైలట్ ప్రాజెక్టు ద్వారా జరిగే రీసర్వేలో భూసమస్యల పరిష్కారానికి మంచి అవకాశమని, రైతులు సద్వినియోగం చేసుకోవాలని తహసీల్దార్ రాజశేఖర్ సూచించారు. యానాదివెట్టులో మంగళవారం రైతులతో గ్రామసభ నిర్వహించారు. ఈ సందర్భంగా సర్వే నెంబర్ల వారీ రైతుల వివరాలను అధికారులు వెల్లడించారు. ఈనెల 22 నుంచి క్షేత్ర స్థాయిలో వారిభూముల వద్దకు సర్వే సిబ్బంది చేరుకుని వివరాలు పరిశీలించి సమస్యల పరిష్కారానికి చొరవ చూపుతారని తెలిపారు. కార్యక్రమంలో సూళ్లూరుపేట డిప్యూటీ ఇన్‌స్పెక్టర్ సర్వే ప్రసాదరావు, మండల సర్వేయర్ రమణయ్య, సిబ్బంది పాల్గొన్నారు.

గౌరిపెద్ది పాండిత్యం యువతకు స్ఫూర్తిదాయకం



గౌరిపెద్ది రామసుబ్బ శర్మ విగ్రహానికి నివాళులు అర్పిస్తున్న పలువురు సాహితీవేత్తలు, ఇతర అధికారులు

– ప్రముఖ శతావధాని భరత్ శర్మ

తిరుపతి కల్చరల్: తిరుమల శ్రీవేంకటేశ్వరస్వామికి అమూల్యమైన సేవలందించిన గౌరిపెద్ది రామసుబ్బశర్మ జీవితం, ఆయన అన్నమాచార్య కీర్తనలపై చేసిన కృషి యువతకు స్ఫూర్తిదాయకమని ప్రముఖ శతావధాని భరత్ శర్మ అన్నారు. గౌరిపెద్ది రామసుబ్బ శర్మ 34వ వర్ధంతి పురస్కరించుకుని మంగళవారం అన్నమాచార్య కళామందిరంలో సాహితీ సదస్సు నిర్వహించారు. తిరుపతికి చెందిన శతావధాని భరత్ శర్మ 'సాహితీ శిఖరం–గౌరిపెద్ది' అనే అంశంపై ప్రసంగించారు. శ్రీవారికి పరమ భక్తుడైన అన్నమాచార్యులు గానం చేసిన పద కవితలు, సంకీర్తనలను రామసుబ్బశర్మ విశ్లేషించారన్నారు. ప్రముఖ శతావధాని ఆముదాల మురళి 'గౌరిపెద్ది– అన్నమయ్య కీర్తనల పరిష్కరణ' అంశంపై మాట్లాడుతూ, అద్భుతమైన సాహితీ సృజన చేసిన ప్రముఖులలో గౌరిపెద్ది ఒకరని, తాళ్లపాక అన్నమయ్య సంకీర్తనలు 27 సంపుటాలు పరిష్కరించడంలో గౌరి పెద్ది విశేష కృషి చేశారని కీర్తించారు. భారత, భాగవత, పురాణ ఇతిహాసాలను అపూర్వ సాహిత్యంతో అందించిన సంకీర్తనలను గౌరిపెద్ది రామసుబ్బ శర్మ మనకు అందించారని వివరించారు. తొలుత ఎస్వీ ప్రాచ్య కళాశాల ఆవరణలోని గౌరిపెద్ది రామసుబ్బ శర్మ విగ్రహానికి పుష్పాంజలి ఘటించారు. కార్యక్రమంలో అన్నమాచార్య ప్రాజెక్టు సంచాలకుడు రాజగోపాలరావు, గౌరిపెద్ది వెంకట భగవాన్, ప్రోగ్రాం అసిస్టెంట్ కోకిల, ఇతర అధికారులు, ప్రజలు పాల్గొన్నారు.

నిరక్షరాస్యతను రూపుమాపుదాం



మెటీరియల్‌ను అందజేస్తున్న ఏపీఎం

బుచ్చినాయుడుకండ్రిగ : ప్రతి ఒక్కరూ చదవడం, రాయడం నేర్చుకునేందుకుగాను 'ఉల్లాస్' ద్వారా వయోజన విద్యా విధానాన్ని అమలు చేస్తున్నట్లు ఎంపీడీఓ త్రివిక్రమ్‌రావు తెలిపారు. మండల కేంద్రంలోని ఐకేపీ కార్యాలయంలో మంగళవారం నవభారత్ 'ఉల్లాస్'లో వీఓఏలు, వాలంటీర్ టీచర్లకు శిక్షణ కార్యక్రమం చేపట్టారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ నిరక్షరాస్యతను రూపుమాపాలనే ఉద్దేశంతో ప్రభుత్వం నవభారత్ ఉల్లాస్ కార్యక్రమానికి శ్రీకారం చుట్టిందన్నారు. ఇందులో 15 సంవత్సరాలు వయస్సు పైబడిన నిరక్షరాస్యులైన వారికి అక్షరాలు నేర్పించడం జరుగుతుందన్నారు. ఇందుకోసం ముందుకొచ్చిన వాలంటీర్ టీచర్లకు ఎంఈఓలు రవీంద్రనాథ్, మునిసుబ్రమణ్యం శిక్షణ ఇవ్వడం జరుగుతుందన్నారు.అనంతరం వీఏఓలు, టీచర్స్ వాలంటీర్లకు మెటీరియల్‌ను పంపిణీ చేశారు. కార్యక్రమంలో ఏపీఎం మునెయ్య, ఏపీఓ భానుప్రియ, సీసీలు పాల్గొన్నారు.

పరిసరాల పరిశుభ్రతతో ఆరోగ్యం



పరిసరాలను పరిశీలిస్తున్న వైద్యాధికారులు

శ్రీకాళహస్తి : తొట్టంబేడు మండలం చియ్యవరంలో మంగళవారం జిల్లా వైద్య ఆరోగ్యశాఖ అధికారి బాలకృష్ణనాయక్ పర్యటించారు. గ్రామంలో జ్వరాలకు గల కారణాలను తొట్టంబేడు ఆరోగ్య కేంద్రం వైద్యాధికారులను అడిగి తెలుసుకున్నారు. జ్వరంతో ఉన్న వారికి మలేరియా, డెంగీ రాపిడ్ టెస్టులను చేయించారు. అక్కడ ఉన్న పరిసరాలను పరిశీలించారు. ప్రజలు తమ పరిసరాలను పరిశుభ్రంగా ఉంచుకోవాలని, నీటిని కాచి వడబోసి తాగాలన్నారు. రుయా ఆస్పత్రి నుంచి ప్రత్యేక వైద్య బృందాన్ని గ్రామానికి రప్పించారు. కిడ్నీ వైద్య నిపుణులు రవికుమార్, జనరల్ వైద్యులు రమాదేవి, మైక్రో బయాలజిస్టు విజయకుమార్, కమ్యూనిటీ మెడిసిన్ వైద్యులు సకీర్‌ఖాన్ ఆధ్వర్యంలో వైద్య బృందం చికిత్సలు చేశారు. కార్యక్రమంలో డీఎంహెచ్‌వో మృదులవాణి, మలేరియా అధికారి రూప్‌కుమార్, డీపీఎంవో శ్రీనివాసరావు, ఇతర వైద్యాధికారులు పాల్గొన్నారు.

శ్రీవారి సేవలో సినీ ప్రముఖులు



ఆకాష్ పూరి



సంయుక్త మీనన్



మంగ్లీ

తిరుమల: తిరుమల శ్రీవారిని మంగళవారం సినీ నటులు ఆకాష్ పూరి, సంయుక్త మీనన్, గాయని మంగ్లీ దర్శించుకున్నారు. వీరికి ఆలయ అధికారులు ప్రత్యేక దర్శనం ఏర్పాట్లు చేశారు. దర్శనానంతరం ఆలయ రంగనాయకుల మండపంలో వేద పండితులు ఆశీర్వచనం పలికారు. టీటీడీ అధికారులు లడ్డు ప్రసాదాలతో సత్కరించారు.

బిస్మిల్లా నగర్ లోని ఖాళీ స్థలాల్లో మురుగు నీటి గుంత



రోడ్డుపైనే ఎక్కడ చూసినా వ్యర్థాలు



అధికారుల నిర్లక్ష్యం.. దుర్గంధభరితం

శ్రీకాళహస్తి రూరల్ (రేణిగుంట): అధికారుల నిర్లక్ష్యానికి నిదర్శనం ఈ మురుగునీటి గుంతలే. రేణిగుంట పంచాయతీ పరిధిలో ఉన్న ఖాళీ స్థలాలు మురుగునీటితో నిండిపోయాయి. నివాసాల మధ్య ఉన్న ఖాళీ స్థలాల్లో ఈ మురుగునీరు నిల్వ ఉండడంతో దోమలకు ఆవాసంగా మారుతున్నాయి. వాటి వల్ల డెంగీ, మలేరియా వంటి విషపు జ్వరాలు ప్రబలే ప్రమాదం ఉందని స్థానికులు భయాందోళన చెందుతున్నారు. బిస్మిల్లా నగర్‌లో ఇలాంటి మురుగనీటి కేంద్రాలు అధికంగా ఉన్నాయి. ఇక్కడ పంచాయతీ అధికారుల పర్యవేక్షణ లోపం స్పష్టంగా కనిపిస్తోంది. ఆ కాలనీలో వీధి కాలువలు కూడా సక్రమంగా లేవు. ఫలితంగా పక్కన నివాసం ఉంటున్న ప్రజలు దుర్గంధం భరించలేక అల్లాడిపోతున్నారు. బిస్మిల్లా నగర్ లోని ఖాళీ స్థలాల యజమానులు బయట వ్యక్తులు కావడం వల్ల నోటీసులు ఇవ్వలేకపోతున్నామని, ఆ ప్రాంతాల్లో ఆయిల్ బాల్స్ వెంటనే వేస్తామని ఈవో మణి తెలిపారు.